## క్లుప్తంగా

### ట్రాఫిక్ పోలీసుల కష్టాలు


ఎండకు గొడుగు ధరించిన పోలీస్

తొట్టంబేడు(రేణిగుంట): వేసవి తాపానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లలు, పెద్దలు అల్లాడిపోతున్నారు. పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఎండలో కూడా ట్రాఫిక్ నియంత్రణలో విధులు నిర్వహిస్తున్నారు. దేవస్థానానికి నిత్యం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణలో ఎండను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. వేసవి తాకిడి తాళలేక కొంతమంది పోలీసులు తలవరకు ఎండ తగలకుండా గొడుగులు వేసుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న వారికి వేసవి తాపానికి ప్రత్యేకంగా తలకు ఉపయోగపడే పరికరాలు అందజేయాలని పలువురు సూచిస్తున్నారు. ఇటీవల అనంతరపురంలో ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్‌లు అందించారు. అలాంటివే ఇక్కడ కూడా అధికారులు అందిస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.

### పేరంటాలమ్మకు పొంగళ్లు


పొంగళ్లను తీసుకెళ్తున్న వడ్డిపాళెం గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరులో ఉన్న పేరంటాలమ్మ ఆలయం వద్ద వడ్డిపాళెం గ్రామస్తులు ఆదివారం సాయంత్రం పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

### అంకమ్మ దేవతకు పూజలు


పూజలందుకున్న అంకమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: వేణుగోపాలపురం గ్రామదేవత అంకమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు.

### సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ వివక్ష

తిరుపతి కల్చరల్: సహకార బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ వివక్ష చూపుతోందని ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జేవీ. సత్యనారాయణమూర్తి తెలిపారు. విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు తిరుపతి శాఖ సభ్యుల మహాసభ ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించారు. వివిధ రుణాలకు సంబంధించి పరిమితులను నిర్ణయించుకునే అధికారం సహకార బ్యాంకులకు ఆర్‌బీఐ ఇవ్వడం లేదన్నారు. కొత్త శాఖల ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. విద్యలో రాణిస్తున్న బ్యాంకు సభ్యుల పిల్లలకు ప్రో త్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. 80 శాతం రుణాలను అల్పాదాయ వర్గాలకే ఇస్తున్నమని తెలిపారు.

### శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్, ఇన్‌కమ్ ట్యాక్స్ జస్టిస్ డి.రామలింగారెడ్డి, ఇండియన్ ఫారెస్ట్ డైరెక్టర్ జనరల్ ప్రకాష్ గోయల్, మాజీ మంత్రి శంకర్ నారాయణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

### 10న విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

తిరుపతి కల్చరల్: కేటీ రోడ్డులోని టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జూన్ 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు సంఘం సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు టీటీడీ పెన్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యుల నియామకాలు, సంఘం బైలాను ఆమోదించనున్నట్టు తెలిపారు. అలాగే మృతి చెందిన సంఘ సభ్యుల వారసులకు సోషల్ సెక్యూరిటీ పథకం కింద రూ.50 వేలు చెల్లిస్తామని పేర్కొన్నారు. 75 ఏళ్లు నిండిన టీటీడీ విశాంత ఉద్యోగులకు ఆనవాయితీగా 10 గ్రాముల వెండి డాలర్, జ్ఞాపిక అందజేసి సత్కరిస్తామని వెల్లడించారు.

### నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ హరిత తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, ఉదయం 10:30 నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లేందుకు 0877–2227208కు కాల్ చేయాలని సూచించారు.

# మంచినీళ్ల గుంటకి మహర్దశ

**రేణిగుంట పట్టణ నడిబొడ్డున చారిత్రక ప్రాశస్త్యం కలిగిన మంచి నీళ్లగుంటను సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్న స్థానిక ప్రజల కలను సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. తుడా నిధులతో శ్రీకాళహస్తి తరహాలో ఇక్కడ కోనేరు, వాకింగ్ ట్రాక్, పార్కుగా అభివృద్ధి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తుడా అధికారులతో మాట్లాడి చొరవ తీసుకున్నారు.**

- నెరవేరనున్న రేణిగుంట ప్రజల ఆకాంక్ష
- తుడా నిధులతో ఏకకాలంలో సుందరీకరణ
- తలమానికంగా మారనున్న మంచినీళ్ల గుంట


రేణిగుంట మంచినీళ్ల గుంట

రేణిగుంట: మండలకేంద్రంలో బుగ్గవీధిలో మంచినీళ్ల గుంటకు ఎంతో చరిత్ర ఉంది. గతంలో వర్షపు నీరు వాగులగుండా ఈ గుంతలోకి పారడంతో గుంత నిండి తూర్పు వైపున ఉన్న నంది విగ్రహ సారంగం గుండా బయటకు వెళ్లేవని చారిత్రక నేపథ్యం ఉంది. ఒకప్పుడు ఈ గుంటకు ఆనుకుని ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఏటా తెప్పోత్సవాలు ఘనంగా జరిగేవి. అలాగే పూర్వకాలం రాణులు ఈ గుంతలో స్నానం ఆచరించడం వల్ల రాణిగుంటగా పేరొచ్చిందని, కాలక్రమేణా అది రేణిగుంటగా రూపాంతరం చెందినట్లు కిందటితరం పెద్దలమాట. అయితే మంచినీళ్ల గుంటను అభివృద్ధిని చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని గతంలో అనేకమంది పాలకులకు స్థానికులు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో 2017లో రూ.30 లక్షలు తుడా నిధులతో గుంటకట్టపై మట్టితో చుట్టూ కట్టను బలపరిచి వదిలేశారు. అందుకోసం 4.5 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ గుంటను పుష్కరిణిగా మార్చి, గుంట చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు తుడా రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే తుడా అధికారులు పలుమార్లు పరిశీలించి మంచినీళ్ల గుంట అభివృద్ధి, సుందరీకరణ గురించి నివేదికలు సిద్ధం చేశారు. ఇక్కడ పనులు పూర్తి చేస్తే పట్టణంలోని మహిళలు, వృద్ధులు, చిన్నారులకు మంచినీళ్ల గుంట ఎంతో ఆహ్లాదాన్ని నింపడం ఖాయమని స్థానికులు భావిస్తున్నారు. అయితే ఈ గుంట అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోకపోవడంతో ఊరిమధ్యన నిరుపయోగంగా పడి ఉంది. ఇప్పుడు ఎమ్మెల్యే బియ్యపు మధు చొరవతో మంచినీళ్ల గుంట రూపరేఖలు మారనున్నాయి.

**ఎంతో బాగుంటుంది..**



చరిత్రకు చిహ్నమైన మంచినీళ్ల గుంటను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచి పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకురావాలి. సుమారు 60 వేలకు పైగా జనాభా ఉన్న రేణిగుంటలో మానసిక ప్రశాంతత కోసం చిన్నపార్కు కూడా లేదు. ఊరు మధ్యలో ఉన్న దీన్ని అభివృద్ధి చేసి పార్కును నిర్మిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. – **శ్రీకళ, రేణిగుంట**

**ఆకతాయిలకు అడ్డా..**



మంచినీళ్ల గుంట ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రస్తుతం ఆకతాయిలకు అడ్డాగా మారింది. దీన్ని ఏకకాలంలో ఆధ్యాత్మిక మేళవింపులతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. సాయంత్రం వేళ కాసేపు ప్రశాంతంగా కూర్చుని పిచ్చాపాటి కబుర్లు చెప్పుకోవాలన్నా రేణిగుంటలో అనువైన ప్రదేశం లేదు. దీన్ని అభివృద్ధి చేస్తే ఎంతో బాగుంటుంది. పట్టణ ఖ్యాతి మరింత పెరుగుతుంది. – **సంజీవరాయప్ప, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, రేణిగుంట**

**కచ్చితంగా అభివృద్ధి చేస్తా..**



శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నది, ఆలయ మాస్టర్ ప్లాన్ సుందరీకరణ పనులు పూర్తయిన వెంటనే రేణిగుంట మంచినీళ్ల గుంటను తుడా సహకారంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా. రేణిగుంట చారిత్రక నేపథ్యానికి దర్పణంగా మంచినీళ్ల గుంటను తీర్చిదిద్దుతాను. ఇప్పటికే నిధులు మంజూరయ్యాయి. స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే దిశగా కచ్చితంగా అభివృద్ధి పరుస్తాం.
– **బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి**

### మహిళలకు అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ప్రపంచ రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), శివపార్వతి పట్టణ మహిళా సమాఖ్య పరిధిలో ఉన్న అన్ని సంఘాల మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలాహుస్సేన్ మాట్లాడుతూ రుతుస్రావం అనేది ఒక సహజ ప్రక్రియ అని తెలియజేశారు. ఏటా మే 28న ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవంగా పాటిస్తున్నారని చెప్పారు. అలాగే నెలసరి సమయంలో పాటించాల్సిన పరిశుభ్రతపై చాలామందికి అవగాహన ఉండదన్నారు. నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని మహిళలు అంతా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం పట్టణంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సెక్రటరీ విజయ, భానుప్రియ, స్వప్న, ఆశా వర్కర్ అర్బన్ హెల్త్‌సెంటర్ ఆరోగ్య కార్యకర్తలు మెప్మా సిబ్బంది ప్రసాద్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఎం.కావమ్మ, అమ్మాజి, అజీజున్నీసా, మెప్మా సిబ్బంది, మహిళ ఆరోగ్య సమితి సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బంగారమ్మ జాతరలో బియ్యపు పవిత్రా రెడ్డి


జాతరలో పాల్గొన్న పవిత్రా రెడ్డి, ఎంపీపీ నిర్మలమ్మ

తొట్టంబేడు(రేణిగుంట): మండలంలోని బసవయ్యపాళెం గ్రామదేవత బంగారమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రా రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరను పురస్కరించుకుని ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, సర్పంచ్ శంకర్, నాయకులు హరిగోపాల్, పవన్, హరిబాబు, నాదముని, అయ్యప్ప, గంగరాజు, ప్రకాష్, ఉదయ్, కల్యాణ్ పాల్గొన్నారు.

## ‘యువనేస్తం’ సేవలు అభినందనీయం


కరదీపికను ఆవిష్కరిస్తున్న తిరుమలయ్య

ఏర్పేడు: యువనేస్తం అసోసియేషన్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జెడ్పీటీసీ తిరుమలయ్య అన్నారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో యువనేస్తం అసోసియేషన్ మూడవ వార్షిక కరదీపికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన మునిశేఖర్ యువనేస్తం అసోసియేషన్‌ను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఎక్కువగా గిరిజనుల అభివృద్ధికి కృషిచేస్తున్న సంస్థ ప్రతినిధులను కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జమ్మల్ల శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌లు పెంచలయ్య, మునిరామయ్య, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, యువనేస్తం అసోసియేషన్ ప్రతినిధులు జస్వంత్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్కూటర్ ర్యాలీ


బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఇంటి స్థలాలను శ్మశాన వాటికతో పోలుస్తూ మాట్లాడిన చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలను ఖండిస్తూ శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ నుంచి ప్రారంభమై పెండ్లిమండపం, వైఎస్సార్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, వీఎంసీ సర్కిల్, బేరివారిమండపం, గాలిగోపురం, బియ్యపు కృష్ణారెడ్డి మండపం మీదుగా వైఎస్సార్ పార్టీ ఆఫీసు వరకు ర్యాలీ జరుగుతుంది. ఈ స్కూటర్ ర్యాలీలో పాల్గొనే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి రావాలని ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: ఇంటి పట్టాల పంపిణీపై ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పేదలు గౌరవంగా తలెత్తుకుని జీవించేలా జగనన్న ప్రభుత్వం అందరికీ ఇంటి పట్టాలు, ఇళ్లు పంపిణీ కార్యక్రమం చేస్తోందన్నారు. అలాగే రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు అక్క, చెల్లెమ్మల పేరిట ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తోందని తెలిపారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికతో పోల్చి పేదలను అవమానించడం తగునా అని ప్రశ్నించారు.

**30న జగనన్న 4 ఏళ్ల పాలన సంబరాలు**

ఈ నెల 30న జగనన్న పాలనకు నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అన్నీ మండల కేంద్రాల్లో నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. కార్యకర్తల సమావేశాలు, పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

నారాయణవనం : చంద్రబాబు వైఖరికి నిరసనగా సోమవారం ఉదయం మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారకాయలు తెలిపారు. ఉదయం 8 గంటలకు నారాయణవనం బైపాస్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

## అలరించిన పాండవ, కౌరవుల బాల్యక్రీడలు


భాగవతం గానం చేస్తున్న భాగవతారిణి జ్యోత్స్న

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ద్రౌపదీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుపతికి చెందిన భాగవతారిణి జ్యోత్స్న జరిగిన పాండవుల కౌరవుల బాల్యక్రీడలు భాగవతం అలరించింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగింపు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మునిరత్నం రెడ్డి, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్యప్రదర్శన



భరత నాట్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చెన్నైకి చెందిన శ్రీహర్ష నాట్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నాట్య గురువులు సౌందర్యవల్లి, గిరిధరణ, హర్షవర్ధిని పర్యవేక్షణలో సుమారు 58 మంది కళాకారులు సౌందరవల్లి, గిరిధరణ, దివ్య మునిరాజ్, సావిత్రి, అర్చన, అనజా, ప్రతీక్ష, వ్శ్వినాథ, కమలవెని, కీర్తన, దర్శిని, అభినయ సహన, రాహుల్, సవారిక నాట్యం చేశారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### నివాళి


సుబ్రమణ్యంరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, కొండల చెరువు మాజీ సర్పంచ్ అర్జున్‌రెడ్డి తండ్రి సుబ్రమణ్యం రెడ్డి(76) మృతికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులర్పించారు. అనారోగ్యంతో సుబ్రమణ్యంరెడ్డి ఆదివారం ఉదయం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచ్ భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పళణిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, నాయకులు అన్నాదొరై, కుమార్, గోపి, నటరాజరెడ్డి, మునస్వామిరెడ్డి తదితరులతో కలిసి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అర్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### జడివాన


ఎర్రమరెడ్డిపాలెంలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

రేణిగుంట: మండలకేంద్రం రేణిగుంటలో ఆదివారం జడివాన కురిసింది. ఈదురుగాలులతో కూడిన పెద్ద వర్షం పడడంతో మండలంలోని పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద ఈదురుగాలులకు ఎర్రమరెడ్డిపాళెంలో విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. సుమారు 10 స్తంభాలు పడిపోగా, దాదాపు రూ.10 లక్షలు మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. విద్యుత్ లైన్లు పునరుద్ధణ పనులను చేపట్టారు. అలాగే ఎస్‌యూ పురం, గుత్తివారిపల్లి, వెదుళ్లచెరువు, కరకంబాడి గ్రామాల్లో మామిడితోటల్లో మామిడికాయలు నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది.

### నేడు గడప గడపకు..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు సచివాలయ పరిధిలోని ఊరందూరు హరిజనవాడలో సోమవారం సాయంత్రం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. కార్యక్రమంలో శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొంటారని ఉంది. కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ఎమ్మెల్యే కృషి చేస్తారని వివరించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై గడపగడపకు మన ప్రభుత్వం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన


నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం, అఖిల భారత రైతు–వ్యవసాయ కూలీ సంఘం నేతలు సంయుక్తంగా ఆదివారం బాలాజీ కాలనీలోని బస్టాప్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం తిరుపతి ఇన్‌చార్జ్ లక్ష్మీసింగ్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లను అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.లలిత మాట్లాడుతూ చట్టాలు చేసిన వారే చట్టాలను ఉల్లంఘించడం దారుణమన్నారు. మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో నేతలు వెంకటసుబ్బయ్య, రాహుల్, ఉన్నతి సింగ్, ఏఐకే కేఎంఎస్ నేతలు ప్రతాప్ సింగ్, హరీష్, అమీనా పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో ‘సెంగోల్’ ఏర్పాటుపై హర్షం

- మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు



పిచ్చాటూరు: పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో సెంగోల్ (రాజదండం) ఏర్పాటు తమిళ జాతికి గర్వకారణమని మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు అన్నారు. ఆదివారం గోవర్ధనగిరిలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లోని స్పీకర్ కుర్చీ వద్ద సెంగోల్‌ను ప్రధాని ఆవిష్కరించడం శుభపరిణామం అన్నారు. ఈ సెంగోల్‌ను తమిళ నేత రాజాజీ సమక్షంలో తమిళనాడులో తయారు చేశారన్నారు. దీనిని 1947లో స్వాతంత్ర్యం ప్రకటనకు 15 నిమిషాల ముందు బ్రిటీష్ చివరి వైశ్రాయ్ మౌంట్ బాటన్, మన తొలి ప్రధాని నెహ్రూకు అందించారన్నారు. తద్వారా రాజ్యాధికారం మార్పిడి జరిగిందని వివరించారు. ఇలా తమిళ సాంప్రదాయాన్ని గుర్తు చేస్తూ మళ్ళీ పార్లమెంటులో ఆ సెంగోల్(రాజదండం)ను స్పీకర్ కుర్చీవద్ద ఆవిష్కరించడం యావత్తు తమిళ సమాజంతో పాటు దక్షిణ భారత దేశం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు.

## సర్వాంగ సుందరంగా చిన్నపిల్లల పార్కు


పార్కు పనులను పరిశీలిస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట : శ్రీకాళహస్తీశ్వరాలయం అతిథిగృహాలు భరద్వాజ తీర్థం సమీపంలోని గంగాసదన్, కైలాస సదన్ ప్రాంగణంలో చిన్నపిల్లల పార్క్ నిర్మాణ పనులను ఆదివారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. పిల్లల పార్కు, గ్రీనరీ అందాలతో సర్వాంగ సుందరంగా పార్కునకు అభివృద్ధి చేయనున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే భక్తులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన అతిథిగృహాల వద్ద పార్కులను అభివృద్ధి చేసి పిల్లలను ఆహ్లాదం పంచడం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో దేవస్థానం డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈ రాజేశ్వరి, పట్టణ ప్రముఖులు స్వర్ణమూర్తి, బాలిశెట్టి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఏర్పేడు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని లవ్ ఇన్ యాక్షన్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని డేవిడ్ లూయీస్ రీస్ ఆస్పత్రిలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రారంభదశలో వ్యాధిని గుర్తిస్తే కొంతవరకు నివారించవచ్చన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 76 మంది వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో లవ్ ఇన్ యాక్షన్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ విజయకుమార్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు మోటారుకు మరమ్మతులు, చేతిపంపు నుంచి వస్తున్న నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో తాగునీటి బోరు మోటారు, చేతిపంపులకు ఆదివారం సర్పంచ్ జొన్నల రమణమ్మ మరమ్మతులు చేయించడంతో తాగునీటి పరిష్కారం అయ్యింది. గ్రామంలోని రెండు చేతిపంపులు, ఒక బోరు మోటారు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గ్రామస్తులు సర్పంచ్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు జొన్నలగోపాల్‌రెడ్డికి సమస్యలను తెలిపారు. వారు స్పందించి మరమ్మతులు చేయించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా పిడుగు పాటుకు గురై దెబ్బతిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించారు.

## బస్సులో నిద్రించిన బాలిక

- తప్పిపోయిందంటూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు
- అలిపిరి బస్టాండ్‌లో బాలికను గుర్తింపు
- తల్లిదండ్రులకు అప్పగించిన ఆర్టీసీ ఉద్యోగులు


పోలీసుల సంక్షంలో బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: బాలిక బస్సులో నిద్రించింది. తల్లిదండ్రులు బాలికను గుర్తించకుండా కిందకు దిగిపోయి తప్పిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి ఆర్టీసీ బస్టాండ్‌లో బాలికను గుర్తించిన ఉద్యోగులు పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. వెంకటగిరి మండలం చిన్నప్పరెడ్డిపల్లికి చెందిన మస్తాన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో తిరుపతి ఏడుకొండల బస్టాండ్‌కు చేరుకున్నారు. లగేజీని జాగ్రతగా దించుకున్నారు. తమ కుమార్తె హేమశ్రీ(11) బస్సులో నిద్రపోతున్నా గుర్తించకుండా కిందకు దిగి వెళ్లిపోయారు. అనంతరం ఆ బస్సు ప్రయాణికులను ఎక్కించుకుని మళ్లీ తిరుమలకు వెళ్లడానికి రైల్వే స్టేషన్ మీదుగా అలిపిరి బస్టాండ్‌కు చేరుకుంది. అలిపిరి బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు ఒక టికెట్ తక్కువ రావడంతో బాలిక హేమశ్రీని గుర్తించారు. అప్పటికీ బాలిక నిద్రపోతూనే ఉంది. ఆ బాలిక వివరాలను అడిగి తెలుసుకనే ప్రయత్నం చేశారు. తండ్రి మస్తాన్ అని, వెంకటగిరి మండలం చిన్నప్పరెడ్డిపల్లి అని తెలపడంతో పాటు తండ్రి ఫోన్ నంబర్‌ను ఆర్టీసీ ఉద్యోగులకు తెలియజేసింది. కండక్టర్ బాలికను కంట్రోలర్ వేలాయుధంకు అప్పగించి వెళ్లిపోయారు. కంట్రోలర్ బాలిక తండ్రి మస్తాన్‌కు కాల్ చేశారు. అప్పటికే మస్తాన్ బస్టాండ్‌లో తమ కుమార్తె హేమశ్రీ కోసం గాలించి తప్పిపోయిందని ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఆర్టీసీ ఉద్యోగుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ బిడ్డ సురక్షితంగా ఉందని వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకువస్తున్నట్లు వివరించారు. ఆ మేరకు ఆర్టీసీ అధికారులు పోలీసుల సమక్షంలో హేమశ్రీని ఆమె తండ్రి మస్తాన్‌కు అప్పగించారు. లగేజీని తీసుకువెళ్లిన మస్తాన్ తమ కుమార్తెను గుర్తించకపోవడాన్ని పలువురు తప్పుబట్టారు.